పురుషోత్తం చౌదరి గారి 200 వ జన్మదిన సందర్భముగా సమర్పించిన వ్యాసం

# ప్రార్ధన

అను అంశముపై పురుషోత్తం చౌదరిగారి అభిప్రాయములు. తన అభిప్రాయములను కీర్తన రూపములో వ్యక్తపరిచారు. ఆంధ్రక్రైస్తవ కీర్తనల గ్రంధము లోని కీర్తనలలో అభిప్రాయములపై మాత్రమే ఈ క్రింది విషయములు పొందు పరచుట జరిగినది. ఆయన గారు వ్రాసిన యితర గేయాలు గాని మరి యే యితరమైన వ్రాతలు నాకు అందుబాటులో లభించలేదు.

ఆంధ్ర క్రైస్తవ కీర్తనల గ్రంధములో 'ప్రార్ధన' అంశము క్రింద కొన్ని కీర్తనలు పొందు పరిచారు. వాటిలో పురుషోత్తం చౌదరి గారు వ్రాసిన రెండు కీర్తనలు యిందు చేర్చబడ్డాయి. ఇందులో ఒక కీర్తన "దాసుల ప్రార్ధన దప్పక యొసగెడు యేసు నాయకుడె మా వేల్పు", రెండవది "నన్ను గన్నయ్య రావా నా యేసు..............." ఈ రెంటి లో యేసు క్రీస్తు ప్రార్ధన గూర్చి చేసిన బోధనా సారాంశమంతా యిందు యిమిడ్చి కీర్తన రూపములో పొందు పరిచారు.

" నా యొద్దకు వచ్చిన వానిని నేనే మాత్రము త్రోసివేయను." అని చెప్పిన యేసు మాటను అధారము చేసుకొని "దోషములు సేయు దుర్జనుడైనను దోసిలొగ్గ బరవాసి జేయుట" అంటే పాపి పశ్చాత్తాపము తో చేసే ప్రార్ధన విని అట్టివానికి పరమొసంగును అను సత్యాన్ని ఈ వచనములో యిమిడ్చారు. బహుశ పురుషోత్తం చౌదరి గారికి యేసుతో సిలువ వేయబడిన దొంగలలో యొకరు పశ్చాత్తాపముతో చేసిన ప్రార్ధన, ఆ ప్రార్ధనకు జవాబుగా యేసు " నేడు నీవు నాతో కూడ పరదైసులో వుందువు" అని చెప్పిన వాక్యభావం యిందు లో స్పష్టముగా కనిపిస్తుంది.

ఆ కీర్తనలో మిగిలిన వచనాలలో చాలా అంశాలు యిమిడ్చారు. అవి ఏవనగా

1. మొదటి వచనములో "ఏకాంత రహస్య ప్రార్ధన" అనే అమ్శము గోచరిస్తుంది. మత్తయి 6 :6 'నీవు ప్రార్ధన చేయునపుడు నీ గదిలోనికి వెళ్ళి తలుపు వేసి రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్ధన చేయుము. అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును." యేసు చెప్పిన ఈ సత్యాన్ని " జనరహిత స్థలమున జనివేడెడి మనుజుల ప్రార్ధన" అని చక్కగా పొందు పరిచారు.

రెండవ వచనములో " విశ్వాసముతో కూడిన ప్రార్ధన" కు సదా జవాబులు వస్తాయనే సత్యాన్ని యిమిడ్చారు. ఇది యేసు చెప్పిన సత్యము. "నమ్ముట నీ వలనైతే నమ్ము వారికి సమస్తము సాధ్యము" మార్కు 9 :23 "ప్రార్ధన చేయునపుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొంది యున్నారని నమ్ముడి." అనే ఈ వాక్య సారాంశము రెండవ వచనములో స్పష్టముగా కనిపిస్తుంది.

" మది విశ్వాసము గూడిన ప్రార్ధన సదయత వినుటకు, జెవులొగ్గున్"

మూడవ వచనములో ఏ యిద్దరు లేక ముగ్గురు చేరి ప్రార్ధిస్తే వారి మధ్య ఆయన వుందునన్న వాగ్దానమును గుర్తుచేస్తూ వ్రాశారు. మత్తయి 18 :20 "ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడి యుందురో అక్కడ నేను వారి మధ్య ఉందునని" యేసు చెప్పిన ఈ వాగ్దానము ఆధారంగా "ముదమున నిద్దరు ముగ్గురు నొకచో బదిలముగా దను ప్రార్ధింపన్ - వదలక దానట వచ్చియుందునని మృదువుగా బలికిన- కృత రక్షకుడట"

ఈ అంశములో నున్న రెండవ పాటలో వ్యక్తిగత జీవితాన్ని వుద్ధరించమని చేసిన ప్రార్ధన భక్తిని, ప్రేమను తనలో పెంపొందించమని, దురాశలు, గర్వమునుండి విమోచించమని, ఈ భయంకర లోకములో దరిచేర్చ గలవాడ వీవు వీవే తప్ప యింకెవ్వరు లేరని ఒప్పుకొనుచు ఆయనను ఆశ్రయించిన ప్రార్ధన ఈ కీర్తన.

ఈ రెండు కీర్తనల ద్వారా మనము గ్రహించగల సత్యాలు ఒకటి దేవుని వాక్యాన్ని ఆయన పఠన చేసి దానిని ఎంతగా జీర్ణించు కున్నాడు ఈ కీర్తనల ద్వారా వ్యక్త పరచుట ద్వారా తెలుసుకుంటున్నాము. రెండవదిగా ప్రార్ధన యొక్క ప్రాముఖ్యతను ఆయన గ్రహించి తన వ్యక్తిగత జీవితంలో అనుభవ పూర్వకముగా అనుసరించాడో తెలుసుకొన కలుగుచున్నాము. మూడవదిగా ఆ పాటలు లేక కీర్తనలు అర్ధసహితముగా, అలోచనా మనస్సుతో పాడుకుంటున్నపుడు, మనమ కూడ ఆయన అనుభూతిని తప్పక పొందగలం. 200 సంవత్సరాల క్రితం వ్రాసిన వాటి భావం, అనుభూతి నేటికి కూడ నిత్య నూతనమైనవిగా అనుభూతిని పొందగలం.

రెవ. డా. గేరా పీటర్ గారు

03-09-2003